## తెలుగు కవిత్వ అధ్యయనంలో కొత్తకోణం

# "తెలుగు కవిత్వం - భవిష్యద్దర్శనం"

డా. పమ్మిపవన్ కుమార్

తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం

మంచి సాహిత్యనికి ఉండే ఆవశ్యక లక్షణాలలో పునర్మూల్యాంకనకు అవకాశం ఉండటం ఒకటి. సహృదయుడైన పాఠకుడు తన శక్తి మేరకు కవిత్వంలోని విలువలను అనుభవిస్తాడు. విమర్శకుడూ, కావ్య కళా మర్మజ్ఞుడూ అయిన పాఠకుడు తాను పొందిన అనుభవాలను సూత్రీకరించే ప్రయత్నం చేస్తాడు. 'కవిత్వం' సూత్రీకరణలు, సిద్ధాంతాల కోసం వేచి ఉండదు. అయినా, విమర్శలూ, సూత్రీకరణలూ, సిద్ధాంతాలూ, వీటికి అపవాద సూత్రాలూ, సిద్ధాంతాలూ..... వెలువడుతూనే ఉంటాయి. ఇదొక అవిచ్ఛిన్న సాహిత్య సంప్రదాయ విచిత్ర చక్రభ్రమణం. దీనికి శతాబ్దాల చరిత్ర ఉంది.

ఒక కవి రచించిన ఒకరచనను అనుశీలించడం వేరు. ఆతని మొత్తం రచనలను అనుశీలించడం వేరు. ఆయుగ లక్షణాలను గుర్తించడం, కవిరచనలలో ఒకదానికో, అన్నింటికో, ఆ యుగంలోని తక్కువ కవుల రచనలకో అన్వయించి చూడటం, అనుశీలించటం, అధ్యయనం చేయటం... ఇవన్నీ వేరు వేరు పనులు. అధ్యయన పరిధిని పెంచుకుంటూ పోయే కొద్దీ జటిలత పెరగడమే కాదు – అటువంటి అధ్యయనానికి కొన్ని ప్రత్యేక పద్ధతులు, సూత్ర, సిద్ధాంతాల సమన్వయం అవసరం అవుతాయి. ముందు చెప్పుకొన్న 'పునర్మూల్యాంకన అవకాశాన్ని' సూత్ర, సిద్ధాంత నిర్మాణానికి కూడా అన్వయించుకోగలిగితే కొత్త సిద్ధాంతాలు, అధ్యయన పద్ధతులు, శాస్త్రాలు కూడా పుడతాయి.

"తెలుగు కవిత్వం – భవిష్యద్దర్శనం" అటువంటి అధ్యయన శాస్త్రం వేయ్యేళ్ళు తెలుగు సాహిత్యంలోని భవిష్యద్దర్శనాన్ని గుర్తించిన పరిశోధన గ్రంథం. విశ్వవిద్యాలయాలు అందించే పరమోన్నత పట్ట ప్రదానం (డి.లిట్.) పొందిన గ్రంథం. విషయ ప్రతిపాదనలో

శాస్త్ర లక్షణాన్ని, వివరణలో అనువర్తనను మేళవించుకొన్న ఈ గ్రంథంలో అమూల్యమైన విషయాలు ఎన్నో ఉన్నాయి.

భవిష్యత్తు అనగానే సాహిత్య జీవులకు చప్పున స్ఫురించే భవిష్యవాదం, భవిష్య శాస్త్రం... అన్న వాటికి ప్రమాణ నిర్వచనాలు దొరుకుతాయి. ఈ గ్రంథంలో (పుటలు 9-60). కాల్పనిక వాదంలోని ఫ్యూచరిజం (విధ్వంసక వాదం) కన్న ఇది భిన్నం అనే విభజన ఈ అధ్యయనానికి ఎంతో మేలు చేకూర్చుతోంది. F.T. MERINETTI అనే ఇటలీ రచయిత ప్రచురించిన ఫ్యూచరిస్టు మేనిఫెస్టో అప్పట్లో ఒక సంచలనం. తొలిసారిగా ఇది 20-02-1909న LE FIGARO అనే పత్రికలో ఫ్రెంచ్ భాషలో ప్రచురించబడింది. గత నిరసనం, వేగాన్ని అందుకోవాలనటం, యంత్ర వినియోగం పెంచాలనటం, విధ్వంసాన్ని సృష్టిచటం, పరిశ్రమలను విస్తరించాలనటం, సాంస్కృతిక పునరుజ్జీవనం జరపాలనటం, సమస్త కళారూపాలను, సాహిత్యాన్ని ధ్వసం చేయాలనటం మొదలైన విషయాలన్నీ ఈ మేనిఫెస్టోలో ఉన్నాయి. అలాగే ధ్వనులే సంగీతం అని, మాటలే కవిత్వం అని, రంగులే శిల్ప చిత్రాలని మెరినిటీ ప్రకటించాడు. మేనిఫెస్టోలోని తీర్మానాలలో మెరినిటీ గతాన్ని నిరశించిన తీరు సామాన్య ప్రజలను సైతం ఆశ్చర్యపరుస్తుంది. కళా, సాహిత్య రంగాలలో గాని, సమాజ నిర్మాణానికి గాని ఏ విధమైన ఉన్నతీకరణ ఈ వాదంలో లేకపోవడం వల్ల మెరినిటీ ప్రతిపాదించిన ఫ్యూచరిజమ్ ప్రపంచవ్యాప్తంగా నిరాదరణకు, తిరస్కారానికి గురయ్యింది.

'భవిష్యవాదం' అనగానే స్ఫురించే ఈ అనావశ్యక విషయాలన్నిటి నుంచి గ్రంధారంభంలోనే పాఠకులను బయట పడేశారు రచయిత్రి. "భవిష్యవాదం మన భారతీయ సంప్రదాయ సాహిత్యమైన పురాణాల వంటి వాటి నుంచీ పుట్టింది" (పుట :25) అని చెప్పినప్పటికీ రామాయణం, భారతం వంటి ఇతి హాసాల నుంచీ ఉదాహరణ పూర్వకంగా భవిష్యద్దర్శనాన్ని నిరూపించారు ఈ గ్రంథంలో. దీనితో పాటు భవిష్య శాస్త్రాన్ని సర్వ శ్రేయోశాస్త్రంగా దర్శించిన భారతీయ యోగశాస్త్ర ప్రమాణాలను పాశ్చాత్యుల శాస్త్ర

దృక్పథాలను సమన్వయించడం – ఈ గ్రంథ ఔన్నత్యానికి కారణం అవుతున్నది.

తెలుగు సాహిత్యంలో భవిష్యద్దర్శనంపై జరిపిన ఈ అధ్యయనానికి నేపథ్యంగా భవిష్యత్తు, భవిష్యత్ శాస్త్రం, భవిష్యవాదం .... మొదలైన వాటితోపాటు ప్రాచ్య, పాశ్చాత్య భవిష్యవాద సిద్ధాంతాలు, భిన్న దృక్పధాలు, కవిత్వ సృష్టి, జాతీయ, అంతర్జాతీయ లక్ష్యాలు ... మొదలైన విషయాలను సవివరణాత్మకంగా చర్చించారు. (పుటలు 1-149).

"యోగులు, ద్రష్టలు ప్రపంచ భవిష్యత్తును దర్శిస్తే, మానవులు భవిష్య జీవితాన్ని కాంక్షించారు" (పుట : 1) అంటారు రచయిత్రి. ఈ రెండు దర్శనాల మధ్య కవితత్మాక సేతువు కూర్చినవారు కవులు, రచయితలు. దేశ, కాల సరిహద్దులను దాటి ఈ సంబంధాన్ని గుర్తించడానికి, భవిష్య శాస్త్ర విలువల నిరూపణకు నాటినుంచి నేటి వరకు వెలువడ్డ రచనలనే సంశోధించి ఫలితాంశాలను మనకు అందించారు రచయిత్రి. ఇటువంటి సమన్వయం చేసిన ప్రతి సందర్భంలోనూ గతానికీ, వర్తమానానికీ, భవిష్యత్తుకూ మధ్య ఉన్న సహేతుక బంధాన్ని ఉపపత్తులలో నిరూపించే ప్రయత్నం ఈ గ్రంథ ప్రామాణిఇకతను మరింత శోభయమానం చేస్తోంది.

"ప్రపంచంలో కవులకు ఒక పాత్ర ఉంటుంది. అది వ్యక్తిగతమైన ఆలోచనలతో మొదలై ప్రపంచవ్యాప్తమైన అభివ్యక్తితో ముగుస్తుంది" (పుట :2) "సైన్సు నవలలో గొప్ప శాస్త్రవేత్తల, మేధావుల ఆలోచనలు దీనికి అతీతం కావు" (పుట : 27). అంటూ సృజన వ్యాపార శీలురలో ఉండే సామ్యతను విపులీకరించారు రచయిత్రి. తర్వాతి పుటల్లో బెర్నాడ్‌షా, అరబిందో, నెహ్రూ, మార్గరెట్‌మీడ్, ఆల్విన్ టాఫ్లర్, పోలక్, గోర్బచెవ్... మొదలైన వారినందరినీ ఒక చోట చేర్చి చర్చించడం లోని ఆంతర్యం" భవిష్యదర్శనంలో సామ్యతే" ననిపిస్తుంది. వీరెవరూ ఒకే రంగానికి, దేశానికి, సంస్కృతికి సంబంధించిన వారు కాదు. బెర్నాడ్‌షా ఐరిష్ నాటకకర్త, సంగీతజ్ఞుడు, విమర్శకుడు. అరబిందో భారతీయుడు. రాజనీతిజ్ఞుడు, తత్వవేత్త. నెహ్రూ న్యాయశాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడు. మార్గరెట్ మీడ్ అమెరికా

వాసి, సాంస్కృతిక నృశాస్త్రవేత్త, రచయిత్రి. ఆల్విన్ టాఫ్లర్ అమెరికా దేశస్థుడు, భవిష్య శాస్త్రవేత్త, సాంకేతిక సమాచార ప్రసార విప్లవాల ప్రర్తకుడు. పోలక్ డచ్ దేశస్థుడు. భవిష్య శాస్త్రవేత్త. గోర్బచెవ్ ఒకప్పటి రష్యా అధ్యక్షుడు. 80వ దశకంలో అటు పాలనలోనూ, ఇటు ప్రభుత్వ వ్యవస్థల అంతరంగిక సంస్కరణలలోనూ విప్లవాత్మకమైన మార్పులు తెచ్చినవాడు.

ఇలా వివిధ రంగాలలో, శాస్త్రాలలో పరిచయం, అభినివేశం ఉన్న అనేక మంది ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలను ఒక చోట చేర్చి చర్చించ గలగడంలోని ఏకసూత్రత భవిష్యద్దర్శనమే ! దీనిని గుర్తించడానికి రచయిత్రి వెలుగులోకి తెచ్చిన మరొక విప్లవాత్మక అధ్యతన పద్ధతి – సమగ్ర విద్యా విషయిక పరిశోధన పద్ధతి *(Trans disciplinary Method).* పాశ్చాత్య విశ్వవిద్యాలయాలలో అధ్యయన శాస్త్రంగా ఉన్న ఈ పద్ధతి మరో రెండు రూపాలలో *(Inter Disciplinary, Multi disciplinary)* ప్రపంచ వ్యాప్తంగా వాడుకలో ఉంది.

త్రికోణంలో అభిముఖంగా సాగే వివిధ కళల, శాస్త్రాల పయనం ఎప్పుడూ కొన్ని కొత్త విషయాలను వెలుగులోకి తెస్తుంది. సునిశితత్వం, సూటిదనం కలిగిన ఈ జ్ఞానానికి, అంతిమ లక్ష్యం, సర్వశ్రేయస్సు. అందుకు నిదర్శనం “ తెలుగు కవిత్వం – భవిష్యద్దర్శనం” – గ్రంథం.

(తెలుగు కవిత్వం – భవిష్యద్దర్శనం – అచార్య జి. అరుణ కుమారి. మొదటి ముద్రణ. ఆగష్టు – 2009. వెల రూ. 275/–, ప్రతులకు వి. చైతన్యకరణ్ రెడ్డి, 49, పద్మావతి కాలనీ, స్వరూప్ నగర్, ఉప్పల్, హైదరాబాద్ – 39)